క్లుప్తంగా

ఆర్టీఓగా బాధ్యతల స్వీకరణ



ఆర్టీఓగా బాధ్యతలు స్వీకరించిన ఆదినారాయణ

గూడూరు: గూడూరు ప్రాంతీయ రవాణా శాఖాధికారి (ఆర్టీఓ) గా జి.ఆదినారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గూడూరు ఆర్టీఓగా పనిచేస్తున్న జీఆర్ రవీంద్రనాథ్, పదోన్నతిపై విజయనగరం ఉప రవాణా శాఖాధికారిగా వెళ్లారు. ఈ మేరకు విజయనగరం ఆర్టీఓగా పనిచేస్తున్న ఆదినారాయణ గూడూరుకు బదిలీ అయి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. గూడూరు, సూళ్లూరుపేట ఎంవీఐలు ముమ్మారెడ్డి సునీల్, అనిల్, ఏఓ సునీల్, శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

పెళ్లకూరు: మండలంలోని బంగారంపేట సచివాలయ పరిధిలో ఆదివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు శనివారం స్థానిక ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణాలు



కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: యుద్ధ ప్రాతిపదికన మున్సిపాలిటీ పరిధిలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అయ్యప్పరెడ్డిపాళెం గ్రామం వద్ద మాజీ మంత్రి పసల పెంచలయ్య పేరుతో ఉన్న జగనన్న కాలనీ, అదే విధంగా బిరదవాడ, శ్రీనివాసపురం వద్ద జగనన్నకాలనీ, పుదూరు బీట్–1, బీట్–2లో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇంటి స్థలాలు కేటాయించారన్నారు. నిర్మాణాలను త్వరిగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలు మంజూరై ఇంతవరకు పనులు ప్రారంభించని లబ్ధిదారులు కూడా వెంటనే పనులు ప్రారంభించాలని కమిషనర్ సూచించారు. బిరదవాడ గ్రామ సమీపంలో ఉన్న టిడ్కో గృహాలను కూడా త్వరలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

కండలేరులో 29.050 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం 29.050 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,450 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 200, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 80, లోలెవల్ స్లూయిజ్‌కు 230 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

వరల్డ్ సైకిల్ డే



నెలబల్లిలో సైకిల్ డే నిర్వహిస్తున్న చిన్నారులు

దొరవారిసత్రం: దొరవారిసత్రంలో సైకిల్ దినోత్సవాన్ని శనివారం ఆయా ప్రాంతాల వైద్య సిబ్బంది వరల్డ్ సైకిల్ డే సందర్భంగా చిన్నారుల చేత సైకిల్ తొక్కించారు. సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలపై పిల్లలకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఏకొల్లు, పూలతోట, నెలబల్లి గ్రామ సచివాలయాల్లో ప్రపంచ సైకిల్ దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ పద్మావతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు చర్యలు



ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న పీడీ

వాకాడు: ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. ఆయన శనివారం మండలంలోని తిరుమూరు గ్రామంలో ఉపాధి పనులను తనిఖీ చేసి కూలీలతో సమావేశమయ్యారు. అందరికీ పనులు కల్పిస్తున్నారా అని ఆరాతీశారు. కూలీలకు ఆయన మజ్జిగ పంపిణీ చేశారు. ఏపీఓ విజయమ్మ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో నేతలు

కలువాయి: మండలంలోని బాలాజీరావుపేటలో రూ.5.50 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటును జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి శనివారం ప్రారంభించారు. గ్రామస్తుల సౌకర్యార్థం మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలు, పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలు వెచ్చించి నిర్మించినట్లు వారు తెలిపారు. సర్పంచ్ సోమల సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ ఎంపీఎన్ ప్రసాద్, నేతలు రాఘవేంద్ర, ఎర్రమనేని వెంకటేశ్వర్లు, సోమల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల కల్పవృక్షం ఆర్బీకేలు

- విత్తు నుంచి విక్రయం దాకా ఒకే చోట
- అందుబాటులో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు
- 19 ఆర్బీకేల ద్వారా 18వేల మంది రైతులకు సేవలు



పాలూరు రైతు భరోసా కేంద్రం

సైదాపురం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 వరకు వ్యవసాయం చేయాలంటే ప్రతి పనికి మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. వ్యవసాయం చేయాలంటేనే విరక్తి కలిగేది. కనీసం రాయితీ విత్తనాల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు ఉండేవి. నాయకులు కనుసన్నల్లోనే విత్తనాలు అయిపోయేవి. నేడు వ్యవసాయం అంటేనే పండుగే అనే పరిస్థితులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ప్రతి గ్రామానికి ఒక రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు కొనుగోలు నుంచి రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించే వరకు, ఎరువులు కొనుగోలు, వ్యవసాయ యంత్ర పరికరాలన్నీ ఆర్బీకేలలో అందుబాటులో ఉన్నాయి. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించడం, పొలంబడి ద్వారా రైతులకు సకాలంలో శిక్షణ, టోల్‌ఫ్రీ 155251 ద్వారా రైతులతో నేరుగా ముఖాముఖితో శాస్త్రవేత్తల సలహాలు అందించేందుకు ఆర్బీకేలు దోహదపడుతున్నాయి. భూసార పరీక్షలు, క్రిమిసంహారక మందులు అందించడంలో ఇవి కల్పవృక్షంలా పనిచేస్తున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పడిగాపులు...

టీడీపీ ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువుల కోసం కిలోమీటర్ దూరం వెళ్లి గంటల తరబడి నిరీక్షించాల్సిన వచ్చేది. క్యూలో రైతులు గంటల కొద్దీ నిరీక్షించేవారు. నేడు ఆ పరిస్థితులు కనపడడం లేదు.

48 గంటల్లోనే ఎరువులు...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్బీకేలలో రైతులకు అవసరమైన ఎరువులను అక్కడ బుక్ చేసుకుంటే వారి ఇంటి ముందు 48గంటల్లోనే వచ్చి చేరుతున్నాయి. సైదాపురం మండలంలో 19 రైతు భరోసా కేంద్రాల ద్వారా 18వేల మంది రైతులకు వ్యవసాయ సేవలను అందిస్తున్నారు.

ఈక్రాప్ బుకింగ్‌తో సాగు చేసిన పంటకు భరోసా..

పొక్కందల గ్రామానికి చెందిన అంతటి కేశవులు తన గ్రామంలో వరి పంటను సాగు చేశారు. వర్షానికి, కరువు కాటకాలకు ఆయన సాగు చేసిన పంట నష్టపోకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా ఆర్బీకేలో వరి పంటకు ఈక్రాప్ బుకింగ్ చేయించుకున్నారు. ఆయన సాగు చేసిన పంట నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందనే నమ్మకం భరోసాని రైతు భరోసా కేంద్రం కల్పించింది.

అందుబాటులో పరికరాలు...

గులించెర్ల గ్రామానికి చెందిన నలమారు రాంగోపాల్ రెడ్డి నిమ్మ, వరి, అంతర్ పంటలను సాగు చేశాడు. ఆ పంటల సాగు సమయంలో పొలం దున్ని సాగు చేయడానికి కావాల్సిన నాగలి, గొర్రు, రోటోవేటర్, ట్రాక్టర్, పైపులు రైతు భరోసా కేంద్రంలో తెచ్చుకుని వ్యవసాయం చేశాడు. రైతు భరోసా ద్వారా తెచ్చుకుని వ్యవసాయం చేయడం వలన వ్యవసాయ పనిముట్లకు ఇబ్బంది లేకుండా పోయింది.

ఎరువులు అందుబాటులో..

రాజులఎరుగుంట పాళెం గ్రామానికి చెందిన గుంటమడుగు శ్రీనివాసులురాజు గతంలో వ్యవసాయం చేసే సమయాల్లో ఆయనకు కావాల్సిన ఎరువులు కొనుగోలు చేసేందుకు సైదాపురం, గూడూరులోని దుకాణాల చుట్టూ తిరిగేవాడు. ప్రస్తుతం ఆయన గ్రామంలోని రైతు భరోసా కేంద్రం ఉండడంతో డీఏపీ, 2020 ఎరువులను తెచ్చుకుని పంటలు వేసుకున్నారు. దీంతో బయటకు వెళ్లే పని తప్పిందని సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

18 వేల మందికి సేవలు..



మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాల ద్వారా 18వేల మంది రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను మండల వ్యవసాయాధికారులు, సహాయక సిబ్బంది అందిస్తున్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పరుగు మందులు, యంత్ర పరికరాలు రైతుల స్వగ్రామాల్లోనే అందుబాటులో ఉంచారు. రబీ సీజన్‌లో 200 మెట్రిక్ టన్నుల యూరియా, 70 మెట్రిక్ టన్నుల డీఏపీ, 150మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను అందజేశారు. – పి.హైమావతి, మండల వ్యవసాయాధికారి, సైదాపురం



లబ్ధిదారుల వివరాలను అందజేస్తున్న సిబ్బంది



కియోస్కర్ ద్వారా అందిస్తున్న సేవలు

మాట తప్పని మడమ తిప్పని నేత జగన్



ఫ్లైఓవర్ పనుల పునఃప్రారంభానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్

- ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గూడూరు: ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ, ప్రజల గుండెల్లో మాట తప్పని, మడమ తిప్పని నేతగా జగన్‌మోహన్‌రెడ్డి చెరగని ముద్రవేసుకున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. స్థానిక రెండవ పట్టణంలోని సిరామిక్ కళాశాల సమీపంలో ఆయన శనివారం ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తితో ఫ్లైఓవర్ వంతెన పనుల పునఃనిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు ముందుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి అనంతరం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్నేళ్లుగా అర్ధాంతరంగా ఆగిపోయిన ఫ్లైఓవర్ పనులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో తిరిగి ప్రారంభించామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిలో ప్రగతి పథంలో నడిపిస్తూనే, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న నేత జగన్ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ ఫ్లైఓవర్ పనులు తిరిగి ప్రారంభానికి నోచుకోవడానికి సీఎం చొరవ చూపితే, ఎమ్మెల్యే పట్టువదలని విక్రమార్కుడిలా, ఆ పనులకు తిరిగి శంకుస్థాపన చేసే వరకూ విశ్రమించలేదని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యేని సత్కరించారు. కార్యక్రమంలో సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ యారం మంజుల, జెడ్పీటీసీ యామిని, నేతు బత్తిని విజయ్‌కుమార్, ఓడూరు బాలకృష్ణారెడ్డి, కోడూరు మీరారెడ్డి, నాశిన నాగులు, సతీష్ రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

హంస వాహనంపై కరియమాణిక్యస్వామి



హంసవాహనంపై విహరిస్తున్న స్వామివారు

నాయుడుపేటటౌన్: తుమ్మూరు గ్రామంలో టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు ప్రత్యేకంగా పూలతో అలంకరించిన హంసవాహనంపై ఆశీనులై గ్రామ పురవీధుల్లో విహరించారు. రాత్రి ఊంజల్ సేవ, ఏకాంతసేవ టీటీడీ వేదపండితులు వైభవంగా జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కరియమాణిక్యస్వామి వారి విమానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

తప్పు చేస్తే చర్యలు తప్పవు



ఉపాధి పనులపై విచారణ చేస్తున్న అధికారులు

చిల్లకూరు: ఉపాధి హామీ పథకంపై జిల్లా అధికారులు చేపట్టిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఇద్దరిపై వేటు వేశారు. మండలంలోని 30 పంచాయతీలలో గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది మే వరకు రూ.9 కోట్లతో చేసిన పనులపై డీఆర్‌పీలు గ్రామసభలు నిర్వహించి ప్రజావేదికలో తనిఖీల్లోని లోపాలను బయట పెట్టారు. దీంతో సామాజిక తనిఖీ వేదికకు హాజరైన పీడీ శ్రీనివాసప్రసాద్ నివేదికలను పరిశీలించారు. పలు గ్రామాల్లో పలువురు క్షేత్ర సహాయకులు, ఉపాధి సిబ్బందికి రూ రూ.1.13 లక్షల జరిమానా విధించారు. తమ్మినపట్నం గ్రామంలో జరిగిన పనుల్లో అవకతవకలకు సంబంధించి అక్కడ పని చేసే క్షేత్రసహాయకులు పద్మ, పనులను పర్యవేక్షించిన టెక్నికల్ అసిస్టెంట్ దేవిని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. డీఓపీ భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మెన్ రాసరాయుడు, ఆర్‌పీడీ రవికుమార్, ఎస్ఆర్‌పీ నాగరాజు, ఎంపీడీఓ గోపినాథ్, ఏపీఓ గిరిబాబు, పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ



ధ్రువపత్రాలను అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

చిల్లకూరు: తీరప్రాంతం గ్రామాల్లోని చిన్నారులకు నెల రోజుల పాటు జిందాల్ సింహపురి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన వేసవి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ముగించారు. వరగలి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రేస్ స్కూల్, వరగలి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుల ఎంతో సహకారం అందించారని తెలిపారు. పేద పిల్లల చదువులకు అవసరమైన సహకారం అందించేందుకు పరిశ్రమ యాజమాన్యం సిద్ధంగా ఉంటుందని పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. యరటపల్లి జానకిరామరెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు శ్రీనివాసరావు, మన్సూరి, రషీద్, మ్యాథ్యూస్, వరగలి ఎంపీటీసీ దారా కోటేశ్వరరావు, రేస్ స్కూల్ అధినేత బాలచెన్నయ్య పాల్గొన్నారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు



మహిళలకు బుక్‌లెట్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: అమలు చేయలేని హామీలను ఇచ్చి గద్దెనెక్కి రాష్ట్రాన్ని నిలువునా ముంచిన చంద్రబాబునాయుడు తన మేనిఫెస్టో ద్వారా ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సగుటూరు, వీర్లగునపాటు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఏపీఎం నిర్మలమ్మ ఆధ్వర్యంలో వేసిన నవరత్నాల ముగ్గులను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు 600 హామీలను ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క హామీకూడా అమలు చేయని మోసకారి చంద్రబాబు అని విమర్శించారు. ఎన్నికలు వస్తున్న సమయంలో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు హామీలను గుప్పిస్తున్నారన్నారు. బాబు అధికారంలోకి వస్తే కరువు తాండవిస్తుందని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 98.5 శాతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకుంటే రాష్ట్రం మళ్లీ స్వర్ణాంధ్ర ప్రదేశ్ అవుతుందన్నారు. 2024 శాసనసభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు గుంటమడుగు రవీంద్రరాజు, వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్‌నాయుడు, సర్పంచ్ పంజాం వసంతమ్మ, నేతలు బెల్లం సుబ్బానాయుడు, పంజాం ప్రతాప్, ఉచ్చూరు నారాయణరెడ్డి, చింతల రామ్మోహన్, ఎద్దల మస్తాన్‌రెడ్డి, జయరామయ్య పాల్గొన్నారు.

నేడు ఎన్ఎస్ఎఫ్ మారథాన్

నాయుడుపేటటౌన్: నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్) వారి సారథ్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణం వద్ద ఆదివారం ఉదయం మారథాన్ పరుగు పందెం పోటీలను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యచే ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు మోమిడి లక్ష్మయ్య శనివారం తెలిపారు. 10, 18, 14, ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలకు 3, 4, 5 కిలోమీటర్ల పరుగు పందెం పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో ఐదు వరుస విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతి, మెడల్స్, సర్టిఫికెట్‌లు, స్పోర్ట్ టీషర్టులను అందజేస్తామని తెలిపారు.

హనుమంతునిపై వేంకటేశ్వరుడి చిద్విలాసం



హనుమంతునిపై స్వామివారు

గూడూరు: స్థానిక రాజావీధిలో వెలసియున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వెంకటగిరి: వీధి విక్రయదారులకు గుర్తింపుకార్డులు, నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టి వారికి షాపులను కేటాయించడం వంటి సమస్యలను పరిష్కరించాలని ఏపీ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివకుమార్ తెలిపారు. శనివారం పట్టణంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. వెంకటగిరి వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ అధ్యక్షుడిగా పి శివయ్య, ప్రధాన కార్యదర్శిగా కె రాధాకృష్ణారెడ్డి, కోశాధికారిగా అరుణ, ఉపాధ్యక్షులుగా చెంచుకృష్ణయ్య, చెంగమ్మ, అంకమ్మ, సహాయ కార్యదర్శిగా కె. పురుషోత్తం, పి.ఆంజనేయులు, పి శంకరయ్యలను ఎన్నుకున్నారు.

లేఔట్ పరిశీలన

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు గ్రామ పరిధిలో సర్వే నంబర్ 68లో ఏర్పాటు చేసిన లేఔట్‌ను శనివారం తహసీల్దార్ రామయ్య పరిశీలించారు. లేఔట్‌లో కొంత ప్రభుత్వ భూమి ఉందని ఇటీవల కొందరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు తహసీల్దార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. వీఆర్వో వంశీ, సర్వేయర్లు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

గూడూరు: రౌడీ షీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకుని సమాజంలో జీవించాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ఆయన శనివారం రెండో పట్టణం పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ రౌడీ షీటర్లు ప్రవర్తనపై పోలీసులు నిరంతరం నిఘా పెడతారన్నారు.

మహిళా పోలీసులే కీలకం

సైదాపురం: గ్రామ సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసులే కీలకమని ఎస్‌ఐ నాగబాబు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం మహిళా పోలీసులకు చట్టలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే వివాదాలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. ప్రతి మహిళ దిశ యాప్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బాధితులుంటే సమాచారం తెలపండి

సూళ్లూరుపేట రూరల్: ఒడిశా రాష్ట్రం బలేశ్వర్ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో సూళ్లూరుపేట మండలానికి చెందిన వ్యక్తులు ఎవరైనా ఉంటే వార్డు, సచివాలయాల సిబ్బంది, వీఆర్వోలు, వలంటీర్లు సమాచారం సేకరించి రెవెన్యూ అధికారులకు అందజేయాలని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. 9849904074 నంబర్‌కు సమాచారం అందజేయాలని సూచించారు.

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): రైలు ప్రమాదంలో మండలానికి సంబంధించిన బాధితులు ఉంటే తమ కార్యాలయంలో గానీ లేదా 7795576689 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

చిల్లకూరు: రైలు ప్రమాదంలో ఎవరైనా బాధితులు ఉంటే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేయాలని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ కోరారు.

నాయుడుపేట: రైలుప్రమాదంలో నాయుడుపేట మండలానికి సంబంధించిన వారెవరైనా ఉంటే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి వెంటనే సమాచారం అందించాలని తహసీల్దార్ రాజేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. 9849904067 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

వెంకటగిరి: రైలు ప్రమాదంలో మండలానికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే తహసీల్దార్, సచివాలయాల వీఆర్వోలు, వలంటీర్ల వద్ద లేదా 9989931806 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ పద్మావతి తెలిపారు.

ఇనుగుంటలో వెంకటగిరి రాజుల శాసనం



ఇనుగుంట గ్రామంలో శాసనాలను పరిశీలిస్తున్న పురావస్తుశాఖ అధికారులు

వెంకటగిరి: తిరుపతి జిల్లా, ఓజిలి మండలంలోని ఇనుగుంట గ్రామంలో వెంకటగిరిని ఏలిన గొబ్బూరి రాజుల శాసనం వెలుగుచూసిందని చరిత్రకారుడు షేక్ రసూల్ అహమద్ తెలిపారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఇటీవల తాను కేంద్రప్రభుత్వ పురావస్తుశాఖ అధికారి ఎం యేసుబాబు బృందంతో కలిసి శాసనాల పరిశీలన నిమిత్తం తిరుపతి జిల్లాలో పర్యటించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో ఇనుగుంట గ్రామంలో ఉన్న శాసనాన్ని అధ్యయనం చేయగా.. అది అప్పట్లో చోళుల పరిపాలనలో ఇరుంగుడురాయి అనే పేరుతో పాకనాడులో భాగమై ఉండేదని.. ఆ తర్వాత పెనుగొండను ఏలిన వేంకటపతిరాయులు కాలంలో చంద్రగిరి రాజ్యంలోని వెంకటగిరి సీమకు చెందిన గొబ్బూరి వంశస్థుల పాలనలో ఉండేదని తేలిందన్నారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న శాసనం ప్రకారం గొబ్బూరి జగ్గరాజు, ఓబరాజు ఆ ప్రాంతానికి చెందిన తిరుమల రాజయ్యకు చెరువును కట్టించి తూములు స్థిరపరిచి మెట్టుభూమిని కేటాయించినట్లు శాసనంలో పేర్కొన్నట్లు రసూల్ తెలిపారు.

పోక్సో చట్టం కింద కేసు నమోదు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): పదిహేనేళ్ల గిరిజన బాలికకు మాయమాటలు చెప్పి ఆమెను గర్భవతిని చేసిన వ్యక్తిపై బాలాయపల్లి ఎస్‌ఐ వీరనారాయణ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసు కథనం.. బాలాయపల్లి మండలం, పిగిలాం గిరిజన కాలనీకి చెందిన ముప్పాళ్ల చిరంజీవి భజన గురువుగా పిల్లలకు భజన నేర్పిస్తుండేవాడు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి ఆమెకు శారీరకంగా దగ్గరయ్యాడు. అనుమానం వచ్చిన తల్లిదండ్రులు ఆ బాలికలకు వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేకం, అంగన్‌వాడీ సిబ్బందితో విచారించి వైద్యపరీక్షలు చేయించగా.. ఐదు నెలల గర్భవతి అని తేలింది. శుక్రవారం బాలిక కుటుంబ సభ్యులు బాలాయపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరనారాయణ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): జగనన్న లేఔట్‌లలో గృహ నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీడీఓ రవీంద్రబాబు పేర్కొన్నారు. అలిమిలి, గొట్టికాడు జగనన్న కాలనీలను ఆయన పరిశీలించారు.